క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

బాపట్లటౌన్: స్థలం దారి విషయంలో పెద నాన్న మేడిబోయిన సుబ్బారెడ్డి పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు మేడిబోయిన స్వామిరెడిని శుక్రవారం అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు రూరల్ ఎస్ఐ సింగయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ..

బాపట్లటౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. చీరాల మండలం, ఈపురుపాలెం గ్రామానికి చెందిన అవ్వారు శివశంకర్ ఈ నెల 2న రాత్రి పొన్నూరు నుంచి ద్విచక్రవాహనంపై బాపట్ల వస్తుండగా అప్పికట్ల పెట్రోలు బంకు సమీపంలో డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

బాపట్ల అర్బన్ : జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చెరువు జమ్ములపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్ వెస్లీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జమ్ములపాలెం వెటర్నరీ డాక్టర్ ఎస్.సాహిత్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ప్రతినిధులను అభినందించారు. దాతలు బొద్దుకూరి దానరాజ్, శ్యామసుందరి సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయురాలు జోగి శ్యామసుందరి, వెటర్నరీ అసిస్టెంట్ కటికల రాహుల్ పాల్గొన్నారు.

డ్రోన్ వచ్చేసింది..

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలంలో డ్రోన్ల ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దారు డి.కవిత శుక్రవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని కేర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు క్రీడా ప్రాంగణం నుంచి డ్రోన్ సర్వేను పర్యవేక్షించారు. అక్కడి నుంచి డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేకు మండలాన్ని మొత్తం 9 భాగాలుగా విభజించడం జరిగిందన్నారు. పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, అల్లూరు రెవెన్యూ గ్రామాలను 35 స్క్వేరు కిలోమీటర్లు 8 వేల ఎకరాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం మూడు రోజుల్లో సర్వే పూర్తి కానున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ అమానుల్లాఖాన్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'ఫుడ్ సైన్స్' విద్యార్థిని

బాపట్ల అర్బన్ హిందూస్తాన్ కోకో–కోలా బేవరేజస్ కంపెనీ విజయవాడ ప్లాంట్‌లో రూ.5.5లక్షల వార్షిక జీతంతో ఫుడ్ సైన్స్ కళాశాల విద్యార్థిని లక్ష్మీ శ్రీయ ఎంపికై నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ వై.రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని గతంలో తైవాన్‌లోని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ (ఏవీఆర్‌డీసీ)లో రెండు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినట్లు తెలిపారు. కళాశాల డీన్, ప్రొఫెసర్లు లక్ష్మీ శ్రీయకు అభినందనలు తెలిపారు.

ఉత్తమ సహకార సంఘంగా 'పెదపూడి'

పెదపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఉత్తమ సొసైటీగా ఎంపిక చేయడం జరిగిందని సొసైటీ సెక్రటరీ శివశంకరరావు తెలిపారు. సొసైటీ చైర్మన్ కొసరాజీ వెంకట బసవేశ్వరరావును ఈ సందర్భంగా శుక్రవారం సన్మానించారు. మెమెంటో, నగదు అందజేశారు. విజయవాడలో కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ సహకార సంఘాల చైర్మన్‌లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకని గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.

సారా బట్టీలపై దాడులు

50 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బాపట్లటౌన్: సారా బట్టీలపై సెబ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. మండలంలోని స్టువర్టుపురం పెద గ్యాంగ్ పరిధిలో దేవర ప్రియాంక నాటుసారా తయారుచేస్తుండగా సమాచారం తెలుసుకున్న సెబ్ అధికారులు దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. దాడి చేసిన వారిలో సెబ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రభుదాస్ ఉన్నారు.

ప్రజలు మెచ్చేలా..'జగనన్న సురక్ష'

- వంద శాతం సేవలు అందించాం
- ప్రతి ఇంటి తలుపు తట్టాం..
- రాష్ట్రంలోనే కర్లపాలెం సచివాలయానికి రెండో స్థానం
- ఎమ్మెల్యే కోన రఘుపతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, పక్కన నాయకులు

బాపట్ల అర్బన్ : రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో నాలుగవ స్థానం రావడం ఎంతో సంతోషమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సమన్వయంతో పని చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు మెచ్చేలా జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కోన మాట్లాడారు. 'జగనన్న సురక్ష'లో రాష్ట్రంలోనే కర్లపాలెం సచివాలయం రెండో స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. బాపట్ల జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రతి గుమ్మం తలుపు తట్టి, అధికారులు సమన్వయంతో పని చేయడం వల్లే బాపట్ల జిల్లాకి పేరు వచ్చిందని కొనియాడారు.

నూరు శాతం పథకాలు అందజేయడమే లక్ష్యంగా..

జిల్లా స్థాయిలో కలెక్టర్, అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమయ్యేందుకు ప్రత్యేకంగా కృషి చేశారని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 81,906 మందిని సర్వే చేసి, 68 క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. 73,062 దరఖాస్తులు నమోదు కాగా 99.71 శాతం అంటే 72,852 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వందశాతం పథకాలు అందజేయాలన్నదే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జేసీ ఎస్ మండల కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పుష్పరాజ్యం, చింతల రాజశేఖర్, యువజన అధ్యక్షుడు ఆట్ల ప్రసాద్ రెడ్డి, రమేష్, సాంబా చెన్నకేశవులు, మీరాబీ, కానుగంటి లక్ష్మీరాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనగానివి నీచ రాజకీయాలు

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు


మృతుడు అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోటేశ్వరరావు

చెరుకుపల్లి: ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కుట్రలు చేస్తూ.. లబ్ధిపొందాలనే నీచరాజకీయాలకు తెగబడటం సిగ్గుచేటని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరక్టర్ కామినేని కోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. మండలంలోని ఉప్పాలవారిపాలెం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన ఉప్పాల అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను ఆయన శుక్రవారం పరామర్శించారు. అమర్‌నాథ్ మృతి అత్యంత పాశవికమని, ఘటన జరిగిన వెంటనే రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు స్పందించి, అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశారని తెలిపారు. అమర్‌నాథ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తన స్వార్థం కోసం అబద్ధాలతో ఆకుటుంబాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవటం హేయమన్నారు.

క్రైస్తవ సంఘాల శాంతియుత ర్యాలీ



నిజాంపట్నం: మణిపూర్ హింసాకాండపై క్రైస్తవ సంఘాలు శాంతియుత ర్యాలీ నిర్వహించాయి. శుక్రవారం నిజాంపట్నంలోని కింగ్ ఆఫ్ కింగ్ లార్డ్ ఆఫ్ లార్డ్ ఫెలోషిప్, గ్లోరీ ఫెలోషిప్, ఇమ్మానియేల్ వెల్ఫే అసోసియేషన్ ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు దారుణమన్నారు. క్రైస్తవులపై దాడులు చేస్తున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కె.నెహ్రూ బాబుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ కాపరులు, మాజీ ఎంపీటీసీ మిరియాల ఏసు, మణిబాబు, కృపారావు, రత్నరాజు పాల్గొన్నారు.

'గాంధీ మళ్లీ వస్తే' లఘుచిత్రం చిత్రీకరణ ప్రారంభం



బాపట్ల: వీఆర్ క్రియేషన్స్ సమర్పణలో 'గాంధీ మళ్లీ వస్తే' లఘుచిత్రం చిత్రీకరణను బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు శుక్రవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా లఘుచిత్రం నిర్మించటం గొప్ప విషయమన్నారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ బాపట్ల పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున లఘు చిత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. చిత్రానికి రచన వెంకు సనాతని అందించగా, గాంధీ పాత్రలో శివ శంకర్ నటించనున్నారు . ఈ కార్యక్రమంలో చిత్ర బృంద సభ్యులు భ్రమర, మౌనిక, ఆదం షఫీ, సయ్యద్ పీర్, ఏడుకొండలు, బాషా, సురేష్, కృష్ణ, క్రిష్ణ కిషోర్, సాయికిరణ్, వినోద్, వెంకట్, శ్రీహరి పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం


ఆవులవారిపాలెంలో కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ సిబ్బంది


కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కొల్లూరు: గర్భిణీలకు, బాలింతలకు సమృద్ధిగా పౌష్టికాహారం అందజేసేందుకు ప్రభుత్వం వారి ఇళ్లకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో పోషకాహార పదార్థాలను అందజేస్తోందని గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బావిరెడ్డి వెంకట్రామయ్య, అనంతవరం సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.నాంచారమ్మ, ఎస్.సుష్మశ్రీ పాల్గొన్నారు.

గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

నిజాంపట్నం: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటికే అందజేస్తున్నట్లు సర్పంచ్ శౌంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అడవులదీవి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారం


నెక్కంటి సుబ్బారావును సత్కరిస్తున్న ప్రాణాధార సంస్థ సభ్యులు

బాపట్ల అర్బన్: చెరువు జమ్ములపాలెం గ్రామంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామస్తుడు నెక్కంటి సుబ్బారావును గ్రామస్తులు, ప్రాణాధార సంస్థ ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారం అందజేసి, ఘనంగా సత్కరించారు. ప్రణాధార సంస్థ అధ్యక్షుడు కుర్ర పుండరీకాక్షులు మాట్లాడుతూ ధాన్ పండిట్ పురస్కార్ గ్రహీత నెక్కంటి సుబ్బారావు శాస్త్రవేత్తలు చేయలేనిది, రైతుగా సాధించారన్నారు. దేశ ఆహార భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న అన్నధాత, ఆహార స్థిరత్వానికి దోహదపడే రైతు శాస్త్రవేత్తగా విదేశీ మీడియా నుంచి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. దేశం ఆహార భద్రత కొరత నివారణకు నిరంతరం కృషి చేస్తున్న ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధరరావు, నెక్కంటి కిరణ్ ప్రకాష్, నూతలపాటి బాబు, ఆకుల సాంబశివరావు, గూడూరుబాబు, కుర్రా నాగేశ్వరరావు, డాక్టర్ అశోక్‌కుమార్, కాపు అంకమ్మ, వివిధ జిల్లాల రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్‌కు తాళాలు వేసిన కౌలు రైతులు


ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

వలివేరు(వేమూరు): ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఆదేశించినా.. బ్యాంకర్లు ఇవ్వడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ సిబ్బంది కౌలు రుణాలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆగ్రహించిన రైతులు శుక్రవారం బ్యాంక్‌కు తాళాలు వేసి, నిరసన వ్యక్తం చేశారు. అధిక వర్షాలకు వెద సాగు దెబ్బతిందని, నారు లేక నాట్లు కూడా వేయలేదని కౌలు రైతులు చెప్పుకొచ్చారు. కౌలు గుర్తింపు కార్డులపై రుణాలు ఇస్తే పంటలు సాగు చేసుకుంటామని చెప్పారు. బ్యాంక్ మేనేజరు తమకు రుణాల మంజూరు చేసేందుకు సహకరించక పోవడంతో తాళాలు వేశామని కౌలు రైతులు చెప్పారు.

9 నుంచి 'నా భూమి -నా దేశం'

చెరుకుపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నా భూమి –నా దేశం, నేల తల్లికి నమస్కారం –వీరులకు వందనం వంటి కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతీలలో విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో ఐదు రోజుల పాటు అమర వీరుల శిలాఫలకాలు, పంచప్రాణ ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, స్వాతంత్ర్య సమర యోధులను గౌరవించడం, జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతం ఆలపించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అందుకు ఆయా పంచాయతీ కార్యదర్శులు 9వ తేదీ నాటికి సిబ్బందితో చర్చించుకుని ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈవోపీఆర్డీ మురళీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ బాజి

పిట్టలవానిపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం రసాభాసగా మారింది. ఎంపీపీ షేక్ బాజీ అధ్యక్షత వహించారు. చందోలు ఎంపీటీసీ సభ్యుడు చల్లాపల్లి విజయరాజు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. చందోలు పెద హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విజిట్‌లకు వస్తున్నారు, వెళ్తున్నారు.. కానీ కనీసం వంట గదిలో వంట సామగ్రి ఎలా ఉందో అసలు పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించారు. కుక్కర్ లేదు, మిక్సీ లేదు ఎలా వండుతున్నారో ఎవరికీ అర్థ కావడం లేదన్నారు. అపరిశుభ్ర వాతావరణం గురించి అడితే తగాదాలకు వస్తున్నారని ఎంపీటీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజీపాలెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ కూసంపూడి దేవేంద్రరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు పిల్లలు ఉంటున్నారని, వారి కోసం ఒక టీచర్, ఆయా అవసరమా అని ప్రశ్నించారు. అసలు కొన్ని కేంద్రాలలో ఒక రిద్దరి కంటే పిల్లలు ఉండడం లేదని పేర్కొన్నారు. అల్లూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ మండే విజయ్‌కుమార్, ఎంపీటీసీ విజయ రాజు మాట్లాడుతూ చందోలు గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణలో పెద హరిజనవాడను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, ఎంపీడీఓ శేషమాంబ, ఈఓపీఆర్డీ కొల్లిపర పద్మజ, సూపరింటెండెంట్ శివయ్య, ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన గంగయ్య, డి.సింధు, వాలి కృష్ణకుమారి, కత్తికుమారి, సర్పంచ్‌లు యేట్ర అశ్వినిరెడ్డి, మంతెన గంగరాజు, శ్యామల నాగిరెడ్డి, మాధవరావు, కుంభం ప్రసన్నరాజు, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- పెరవలిపాలెంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం


పెరవలిపాలెంలో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

పెరవలిపాలెం(వేమూరు): కుల, మత, వర్గ రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించాలనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి సాధించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణు మొలకల మైథిలీ రాణి, ఎంపీపీ యల్లమాటి మోహన్, మండల ఉపాధ్యక్షరాలు దాసరి శివపార్వతీ, పార్టీ మండల అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెరవలిపాలెం గ్రామంలో శనివారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం చేయాలి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా


ఆరోగ్యమిత్రను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: డాక్టరు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం చేసేలా ఆరోగ్యమిత్రలు పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. బాపట్ల జిల్లా పరిధిలో ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతంగా అందించిన మార్టూరు పీహెచ్‌సీకి చెందిన ఆరోగ్య మిత్ర గాదే అంజిరెడ్డిని ఆయన అభినందించారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో ప్రసంశా పత్రాన్ని, రూ.5వేలు నగదు అందజేశారు. సేవలు విస్తృతం చేయాలని కోరారు.

కొల్లూరులో 10 వేల ఓటర్ల జాబితా తనిఖీ


కొల్లూరులో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

కొల్లూరు: ఓటర్ల జాబితా సవరణ నిర్ణీత గడువులోపు పూర్తి చేయడానికి బీఎల్‌ఓలు కృషి చేయాలని తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వేను ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి చిరునామాలో ఉన్న ఓటర్ల వివరాలు క్షుణంగా పరిశీలించి, తప్పుల సవరణ, ఓటర్ల బదిలీ, చేర్పులు చేపట్టాలన్నారు. ఇందులో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా వ్యవహరించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సవరణ సర్వే ప్రారంభించిన పది రోజుల వ్యవధిలో బీఎల్‌ఓలు మండలంలో 4,663 గృహాలను సందర్శించి 10, 361 ఓటర్ల వివరాలను తనిఖీ చేసినట్లు తహసీల్దారు వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బాపట్లటౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని వెదుళ్లపల్లిలో చోటుచేసుకుంది. వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన కుంచాల శ్రీనివాసరెడ్డి ఈ నెల 2 నుంచి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగశ్రీను తెలిపారు.

పిట్టలవానిపాలెంలో 1,200 ఎకరాల్లో వెద సాగు


మాట్లాడుతున్న మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు

పిట్టలవానిపాలెం: మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ రైతు భరోసాకేంద్రంలో శుక్రవారం గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో ప్రతి శుక్రవారం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో 1200 ఎకరాల్లో వెద పద్ధతిలో వరిసాగు చేసినట్లు తెలిపారు. వరిలో కలుపును జయిస్తే విజయం సాధించినట్లేనన్నారు. కలుపు నిర్మూలన విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శివనాగేశ్వరి, గ్రామ వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ పులుగు శ్రీనివాసరెడ్డి, అల్లూరి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.